బస్తీల్లో రోడ్లు వేయండి

కాచిగూడ: రోడ్లకు మరమ్మతులు చేపట్టి, నూతన రోడ్ల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ అధికారులకు సూచించారు. శుక్రవారం కాచిగూడ డివిజన్ లోని జమాల్ బస్తీ, బండల్ బస్తీ, కుద్బిగూడ, మణియార్ పట్టి తదితర ప్రాంతాల్లో జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి ఆమె రోడ్లను పరిశీలించారు. మంజూరైన సీసీ రోడ్లకు వెంటనే పనులు ప్రారంభించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ ప్రశాంత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ నరేష్, బీజేపీ నేతలు మల్లికార్జున్, బి.భీమ్‌రాజ్, ఆర్.సంతోష్, రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ హుండీ లెక్కింపు

ముషీరాబాద్: ముషీరాబాద్‌లో ప్రసిద్ధిగాంచిన మహంకాళి దేవాలయ మూడు నెలలకు సంబంధించిన హుండీ కానుకలను శుక్రవారం లెక్కించారు. రూ.71వేల ఆదాయం కానుకల రూపంలో వచ్చిందని ఈవో మహేందర్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ ఆండాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు వై. చంద్రమౌళి, బీజేపీ నేత బాలరాజు యాదవ్, కాంగ్రెస్ నేత తేజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

టీబీ శిబిరాల ఏర్పాటుపై సమీక్ష

నల్లకుంట: టీబీ నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకై బస్తీలలో అవగాహన శిబిరాలు ఏర్పాటు చేస్తున్న అంబర్‌పేట సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్(ఎస్‌పీహెచ్‌ఓ) డాక్టర్ పద్మజ చెప్పారు. యూపీహెచ్‌సీలకు మంజూరయ్యే నిధులు ఏ పనులకు వినియోగించాలి, టీబీ శిబిరాల ఏర్పాటు తదితర అంశాలపై శుక్రవారం నల్లకుంట తిలక్‌నగర్ యూపీహెచ్‌సీలో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఎస్‌పీహెచ్‌ఓ డాక్టర్ పద్మజ, కార్పొరేటర్ అమృత, యూపీహెచ్‌సీ డాక్టర్ దీప్తి పటేల్ తదితరులతో కలిసి చర్చించారు. ఈ సందర్భంగా ఎస్‌పీహెచ్‌ఓ మాట్లాడుతూ.. క్రమం తప్పకుండా ఆయా బస్తీలలో టీబీ శిబిరాలు ఏర్పాటు చేసి, టీబీ రోగులకు గుర్తిస్తున్నామని చెప్పారు. అలాగే టీబీ రోగులకు ఇంటి వద్దనే మందులు అందజేస్తున్నట్లు వివరించారు. భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు తమ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో యూపీహెచ్‌సీల వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా శ్రావణమాస బోనాలు



చిక్కడపల్లి: అశోక్‌నగర్ వాటర్‌వర్క్స్ కార్యాలయంలోని శ్రీబంగారు మైసమ్మ ఆలయంలో శుక్రవారం శ్రావణమాస బోనాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రత్యేకంగా నిర్వహించిన పూజలలో వాటర్‌వర్క్స్ డైరెక్టర్ అమరేందర్‌రెడ్డి. సీజీఎం ప్రభు, జీఎం శ్రీధర్‌రెడ్డి, డీజీఎం కార్తీక్‌రెడ్డి, మేనేజర్ కృష్ణమోహన్ పాల్గొని భక్తిశ్రద్ధలతో అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.

'ప్రజల కథే నా ఆత్మకథ' పుస్తకం అందజేత

నల్లకుంట: హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ శుక్రవారం నల్లకుంట శంకర మఠం మార్కెట్ రోడ్డులో ఉన్న బీసీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు నివాసానికి విచ్చేశారు. ఈ సందర్భంగా వకుళాభరణం దంపతులను శాలువాతో సన్మానించి శ్రీకృష్ణుడి కాంస్య విగ్రహం, 'ప్రజల కథే నా ఆత్మకథ' పుస్తకాన్ని అందజేశారు.

ప్రొ. ప్రభంజన్‌యాదవ్‌కు నివాళి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రముఖ సామాజికవేత్త ప్రొ. ప్రభంజన్ యాదవ్ సంస్మరణ సభ శుక్రవారం బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్ భవన్‌లో ఘనంగా జరిగింది. బీఎల్ఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బహుజనుల్లో చైతన్యం తీసుకురావడానికి ప్రభంజన్‌యాదవ్ చేసిన కృషి మరువలేనిదని వక్తలు అన్నారు.

చికిత్స పొందుతూ రోగి మృతి

వైద్యుల నిర్లక్ష్యమే అంటూ బంధువుల ధర్నా

నల్లకుంట: ఓయూ మాణికేశ్వరినగర్‌కు చెందిన గండికోట వేణుగోపాల్(27) కడుపు నొప్పి, గ్యాస్ సమస్యతో చికిత్సల కోసం ఈనెల 22న విద్యానగర్‌లోని డీడీఎంఎస్‌లో చేరాడు. అక్కడ చికిత్స పొందుతున్న అతడు గురువారం సాయంత్రం మృతి చెందాడు. ఇదే విషయాన్ని ఆస్పత్రి వైద్యులు మృతుడి కుటుంబ సభ్యులకు తెలిపారు. దీంతో అరగంట క్రితం ఆరోగ్యంగా ఉన్న వ్యక్తి ఎలా మృతి చెందాడని వారు వైద్యులను ప్రశ్నించారు. మృతికి వైద్యులే కారణమంటూ ఆస్పత్రి ఆవరణలో ధర్నాకు దిగారు. విషయం తెలుసుకున్న నల్లకుంట పోలీసులు అక్కడకు చేరుకున్నారు. ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధి ఆస్పత్రికి పంపిస్తామని పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో మృతుడి కుటుంబ సభ్యులు ఆస్పత్రి వర్గాలతో చర్చలు జరిపారు. కుటుంబీకుల డిమాండ్ మేరకు రోగి ఆస్పత్రి బిల్లులు మాఫీ చేయడంతో మృతదేహాన్ని తీసుకుని వెళ్లిపోయారని డీడీహెచ్ ఆర్ ఎంట డా. ఉమాపతిరావు తెలిపారు. ఇందులో తమ ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యం ఏ మాత్రం లేదని స్పష్టం చేశారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

- అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్
- బ్రాహ్మణ హాస్టల్ లేన్‌లో సీసీ నిర్మాణ పనులకు శంకుస్థాపన



సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ అమృత

నల్లకుంట: అంబర్‌పేట్ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ప్రత్యేక ప్రణాళికలతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ చెప్పారు. రాజకీయాలకు అతీతంగా అన్ని డివిజన్లలోనూ ప్రజలకు మౌళిక సదుపాయాల కల్పనకై ప్రత్యేక శ్రద్ధతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. న్యూ నల్లకుంట బ్రాహ్మణ హాస్టల్ లేన్‌లో రూ. 86 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు శుక్రవారం కార్పొరేటర్ అమృతతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... సీసీ రోడ్డు నిర్మాణ పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలన్నారు. రోడ్డును ఎగుడుదిగుడు లేకుండా నిర్మించాలని కాంట్రాక్టర్‌కు సూచించాలని స్థానికులు ఎమ్మెల్యేను కోరారు. సీసీ రోడ్డు పనులు చేపట్టేది చోటామోటా కంట్రాక్టర్ కాదని, ఈ పనులు పెద్ద కాంట్రాక్టర్‌కు అప్పగించామన్నారు. ఎక్కడ సమస్యలు తలెత్తకుండా స్థానికుల సూచన మేరకే రోడ్డు నిర్మాణ పనులు చేపడతారని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

డివిజన్ సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి...


స్థానికులు కొందరు చిన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అందుకు స్పందించిన ఎమ్మెల్యే చిన్నచిన్న సమస్యలు ఏవైనా ఉంటే స్థానిక కార్పొరేటర్ పట్టించుకోకపోతే ఎలా అంటూ ప్రశ్నించారు. డివిజన్ పరిధిలోని సమస్యలు తెలుసుకునేందుకు తాను తప్పనిసరిగా పాదయాత్ర చేస్తానని తెలిపారు. అలాంటి సమయంలో జీహెచ్ఎంసీ, జల మండలి, విద్యుత్ శాఖ, పారిశుద్ధ్య విభాగాల అధికారులు అందరూ ఉంటే బాగుంటుందన్నారు. ఇక నుంచి జీహెచ్ఎంసీతో పాటు అన్ని విభాగాల అధికారులకు సమాచారం అందించి, అధికారులు పాదయాత్రలో పాల్గొనేలా చూసుకోవాలని బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడికి ఎమ్మెల్యే సూచించారు.

ఆప్యాయంగా పలకరిస్తూ....

అనంతరం స్థానికంగా పాదయాత్ర చేసిన ఎమ్మెల్యే వీధి వీధిలో స్థానికులతో మాట్లాడి ప్రధాన సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అలాగే వృద్ధులు, వాహనాలపై వెళ్లే వారిని ఆప్యాయంగా పలకరించిన ఎమ్మెల్యే వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే నిధులతో నల్లకుంట డివిజన్ పరిధిలో పలు అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డీఈ ప్రవీణ్ కుమార్, ఏఈ పృథ్వీ, వర్క్ ఇన్‌స్పెక్టర్ నరేందర్, కాలనీవాసులు, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

చేవెళ్ల డిక్లరేషన్‌ను అమలు చేయాలి

ఏపీ సీఎం డైరెక్షన్‌లో పనిచేస్తూ మాలలకు సీఎం రేవంత్‌రెడ్డి అన్యాయం చేస్తున్నారంటూ ఆగ్రహం



ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో ధర్నా చేస్తున్న నేషనల్ అంబేద్కర్ సేన నేతలు

కవాడిగూడ: ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే జనాభా దామాషా ప్రకారం ఎస్సీ రిజర్వేషన్లను 18 శాతానికి పెంచుతామని ఇచ్చిన హామీని నెరవేర్చాలని నేషనల్ అంబేద్కర్ సేన జాతీయ అధ్యక్షుడు మన్నె శ్రీధరరావు డిమాండ్ చేశారు. మాలలకు విద్య, ఉద్యోగ రంగాల్లో తీరని అన్యాయం చేస్తున్న కాంగ్రెస్‌కు ఆ పార్టీ మాల ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు డైరెక్షన్‌లో పనిచేస్తూ తెలంగాణలో మాలలకు సీఎం రేవంత్‌రెడ్డి తీరని అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. చేవెళ్ల డిక్లరేషన్‌ను అమలు చేయాలని శుక్రవారం ఇందిరాపార్క్ ధర్నా చౌక్‌లో నిరాహార దీక్ష ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మన్నె శ్రీధర్‌రావు మాట్లాడుతూ... ఎస్సీ వర్గీకరణ చట్టం-2025కు ముందు నోటిఫికేషన్లకు వర్గీకరణ చట్టాన్ని ఏ విధంగా వర్తింప చేస్తారని ప్రశ్నించారు. విద్య, ఉద్యోగ రంగాలలో అమలు జరుగుతున్న రోస్టర్ పాయింట్లను సీరియల్ నం.22 నుంచి 16కు మార్చాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాలల పట్ల అనుసరిస్తున్న తన వైఖరి మార్చుకోకపోతే అసెంబ్లీ ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీల రిజర్వేషన్లకు నష్టం వాటిల్లుతోందని అన్నారు. శీతాకాల అసెంబ్లీ సమావేశాల్లో మాలలకు అమలు జరుగుతున్న రోస్టర్ పాయింట్లపై సరైన నిర్ణయం తీసుకోవాలన్నారు. లేకుంటే మాల ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై తిరుగుబాటు చేస్తామని హెచ్చరించారు. ఈ నిరాహార దీక్షలో నాయకులు తాలుక రాజేష్, గోకుల్ కల్యాణ్, శాస్త్రీ, ప్రవీణ్, కమల్‌కుమార్, రాములు, వినయ్‌కుమార్, మాల సంఘాల నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలి

జిల్లా వైద్యశాఖ అధికారి డా. వెంకటి



ముషీరాబాద్: గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకున్నప్పుడే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని జిల్లా వైద్యశాఖ అధికారి డా. వెంకటి తెలిపారు. శుక్రవారం ముషీరాబాద్ యూపీహెచ్‌సీ లో రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ మిడ్ టౌన్ సంస్థ ఆధ్వర్యంలో తల్లీ, పిల్లలు ఆరోగ్య సంరక్షణపై వైద్య సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డా. వెంకటి మాట్లాడుతూ... తల్లిపాలే పిల్లలకు శ్రేయస్కరమని అన్నారు. ఆశావర్కర్లు, వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి గర్భిణులు, బాలింతలను గుర్తించాలన్నారు. ఎప్పటికప్పుడు వారి ఆరోగ్య విషయాలను తెలుసుకుని వారికి కావాల్సిన మందులను ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డా.పద్మజ, ముషీరాబాద్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి డా. మనోజ్‌రెడ్డి, డా. ధనశ్రీనాయుడు, సునీత, వైజయంతి, అనిత, మిడ్‌టౌన్ అధ్యక్షుడు హజీర్, కార్యదర్శి చంద్రశేఖర్, ప్రతినిధులు నీలా, సీమ, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి



అరుంధతినగర్ బస్తీలో వరద నాలాను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పావని, అధికారులు

చిక్కడపల్లి: వర్షాల వల్ల లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ, జలమమండలి అధికారులకు గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ పావని సూచించారు. శుక్రవారం అరుంధతినగర్, అశోక్‌నగర్, జవహర్‌స్కూల్ తదితర ప్రాంతాలలో పలు చోట్ల జీహెచ్ఎంసీ నిర్వహించిన క్రమబద్ధీకరణ పనులను అధికారులు, హైడ్రా సిబ్బందితో ఆమె పరిశీలించారు. వర్షాల వల్ల ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీమ్ అప్రమత్తంగా ఉండాలని సమస్యాత్మక ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, వాటర్ వర్క్స్ డీజీఎం కార్తీక్‌రెడ్డి, జీహెచ్ఎంసీ డిప్యూటీ ఇంజనీర్ గీత, ఏఈ అబ్దుల్ సలామ్, బీజేపీ నేతలు వి.నవీన్‌కుమార్, రత్నసాయిచంద్, శ్రీకాంత్, వీఎస్టీ రాజు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం



పరిసరాల శుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జీహెచ్ఎంసీ అధికారులు

కవాడిగూడ: పరిసరాల పరిశుభ్రతతో సహా వ్యక్తిగత శుభ్రతను పాటించడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంతో పాటు సీజనల వ్యాధులనూ అరికట్టవచ్చునని జీహెచ్ఎంసీ సర్కిల్-15 ఉప కమిషనర్ రామాంజులరెడ్డి అన్నారు. శుక్రవారం కవాడిగూడ డివిజన్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణ చర్యలపై జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా ఉపకమిషనర్ పాల్గొని మాట్లాడారు. ప్రతీ శుక్రవారం విధిగా డ్రై డే ఫ్రైడే పాటించాలన్నారు. తద్వారా దోమల వ్యాప్తిని అరికట్టవచ్చునని అన్నారు. ఏఎంవోహెచ్ డా.ప్రవీణ్ మాట్లాడుతూ... వానా కాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రతీ ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ కనీస జాగ్రత్తలను విధిగా పాటించాలన్నారు. భోజనానికి ముందుగా సబ్బుతో చేతులను బాగా శుభ్రం చే సుకోవాలని సూచించారు.

- డీబీఆర్ మిల్స్ యూపీహెచ్‌సీ వైద్యాధికారిణి డా.అవంతి మాట్లాడుతూ... వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా బస్తీలు, కాలనీలలోనూ ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇంటి ప్రాంగణాలతో పాటు పరిసరాల్లో నీరు నిల్వలేకుండా చూసుకోవాలని ఎంటమాలజీ అధికారి దుర్గాప్రసాద్ సూచించారు. దోమకాటుకు గురికాకుండా దోమ తెరలు వినియోగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంటమాలజీ ఏఈ శ్రీనివాస్‌రెడ్డి , ముషీరాబాద్ డిప్యూటీ డీఈఓ కె.శ్రవణ్ కుమార్, హెచ్ఎం మీనాకుమారి, ఉపాధ్యాయులు డా.బి.నాగయ్య, సోమయ్య, యాకుబ్ జానీ, హేమలత, సామాజిక కార్యకర్త మహేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి

కాచిగూడ: దేశంలో అత్యధిక జనాభా కలిగిన బీసీల కోసం ప్రభుత్వం ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఢిల్లీలో కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషిని శుక్రవారం ఆర్.కృష్ణయ్య, బీసీ నేతలు కలిశారు. బీసీల డిమాండ్లపై వినతి పత్రం అందజేశారు. విద్య, ఉద్యోగ రంగాల్లో బీసీల రిజర్వేషన్లను 25శాతం నుంచి 50శాతంకు పెంచాలని కోరారు. బీసీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

అంబర్‌పేట: అక్రమ సంబంధం, కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన శుక్రవారం అంబర్‌పేట పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ కథనం ప్రకారం... బాగ్‌అంబర్‌పేట బతుకమ్మకుంటలో నివసించే గోపి(35), లక్ష్మి దుర్గ దంపతులు, వీరికి ఇద్దరు పిల్లలు. గోపి కొంత కాలంగా స్థానికంగా ఉండే ఓ మహిళతో అక్రమ సంబంధం ఏర్పరుచుకున్నాడు. కాగా వీరి మధ్యలో సంబంధం చెడిపోవడంతో ఆ మహిళ సోదరుడితో కలసి గోపిపై దాడి చేసి అతని ఫోన్‌లో ఉన్న ఆ మహిళ ఫొటోలను తొలగించారు. ఈ విషయం తెలిసిన గోపి భార్య లక్ష్మి పుట్టింటికి వెళ్లిపోయింది. పుట్టింటికి వెళ్లిన భార్య లక్ష్మి వద్దకు గోపి వెళ్లి ఇంటికి రావాల్సిందిగా కోరాడు. నాలుగు రోజులు అయ్యాక పంపిస్తామని వారు చెప్పారు. దీంతో ఇంటికి వచ్చిన గోపి ఇంట్లో ఉదయం ఎవరు లేని సమయంలో తన గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బయటకు వెళ్లి ఇంటికి వచ్చిన తల్లి పద్మావతి తలుపుతట్టగా ఎంతకు తీయలేదు. బలవంతంగా తలుపు తొలగించి చూడగా గోపి ఆత్మహత్య చేసుకున్నాడు. వెంటనే అతడిని కిందకు దింపి చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతి చెందినట్లు ఆస్పత్రి వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మతిస్థిమితం సరిగా లేని వ్యక్తి అదృశ్యం




శ్రీనివాస్(ఫైల్)

కవాడిగూడ: మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యమైన సంఘటన దోమలగూడ పీఎస్ పరిధిలోని ట్యాంక్‌బండ్‌పై జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కరీంనగర్ జిల్లా సిరిసిల్ల ప్రాంతంలో నివాసం ఉండే శ్రీనివాస్(50) మతిస్థిమితం సరిగా లేదు. ఆయన కుమారుడు చికిత్స నిమిత్తం నగరంలోని ఎర్రగడ్డ ఆస్పత్రిలో బయల్దేరారు. ట్యాంక్‌బండ్ వేమన విగ్రహం వద్ద శ్రీనివాష్ కుటుంబ సభ్యులకు తెలియకుండా అక్కడ నుంచి తప్పిపోయాడు. ఎంత వెతికినా ఆయన ఆచూకీ లభించకపోవడంతో దోమలగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శ్రీనివాస్‌ను ఎవరైనా గుర్తిస్తే దోమలగూడ పీఎస్‌లో లేదా ఫోన్ నం.87125 68855కు సమాచారం ఇవ్వాలని కోరారు.

మెకానిక్ అదృశ్యం

కాచిగూడ: ఓ బైక్ మెకానిక్ అదృశ్యమైన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... గద్వాల, ఐజా మండలానికి చెందిన ఇస్మాయిల్ కుమారుడు మౌలాసాబ్ (42) బైక్ మెకానిక్. అక్కడ సరిగా మెకానిక్ షాపు నడవకపోవడంతో నగరానికి చెందిన బోయ సత్యంకు తెలిపారు. మౌలాసాబ్‌ను నగరంలోని ఓ కార్ మెకానిక్ వద్ద పనిలో చేర్పించాడు. సరిగ్గా పనిచేయకపోవడంతో మౌలాసాబ్‌ను పనిలో నుంచి తొలగించారు. సత్యం ఈ నెల 17వ తేదీన ఇంటికి పంపించేందుకు మౌలాసాబ్‌ను కాచిగూడ రైల్వే స్టేషన్‌లో రైలు ఎక్కించాడు. అతను గద్వాలలో దిగకుండా ఎక్కడకు వెళ్లాడో తెలియలేదు. దీంతో కుటుంబ సభ్యులు శుక్రవారం కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని సవరించాలి



కార్మికశాఖ మంత్రి వివేక్‌కు వినతి పత్రం అందజేస్తున్న రమేష్ బాబు తదితరులు

కాచిగూడ: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎస్సీ వర్గీకరణ చట్టం 2025 వల్ల మాలలతో పాటు ఎస్సీలోని 26 కులాలు తీవ్రంగా నష్టపోతున్నాయని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోపోజు రమేష్ బాబు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర కార్మికశాఖ మంత్రి గడ్డం వివేక్‌కు మాల సంఘాల ప్రతినిధులతో వెళ్లికి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఎస్సీ వర్గీకరణ చట్టం -2025ను సవరించి మాలలతో పాటు 26 ఎస్సీ కులాలకు న్యాయం చేయాలని కోరారు. ఇటీవల శాతవాహన యూనివర్సిటీ విడుదల చేసిన 35 పార్ట్ టైం లెక్చరర్ల ఉద్యోగుల నోటిఫికేషన్‌లో ఎస్సీలకు కేటాయించిన ఆరు ఉద్యోగాలలో ఒక్కటి కూడా మాల, మాల అనుబంధ కులాలకు రాలేదన్నారు. అక్కడ జీరో పర్సెంట్ రిజర్వేషన్ అమలైనందువల్లే మాలలకు ఉద్యోగ అవకాశం రాలేదని పేర్కొన్నారు. ఇక్కడ పేరుకే 5 శాతం రిజర్వేషన్ ఉన్నా అందులో ఒక్క శాతం రిజర్వేషన్ మాత్రమే మాల, మాల అనుబంధ 26 కులాలకి వచ్చిందన్నారు. ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని సవరించే వరకు నోటిఫికేషన్‌లను నిలపుదల చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జాతీయ ఉపాధ్యక్షుడు కొంద్ర రాజలింగం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వలికి కృష్ణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.


ముస్లిం శ్మశానవాటిక పనులు పూర్తి చేయండి



అంబర్‌పేటలో ముస్లిం శ్మశానవాటికను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్

అంబర్‌పేట: ముస్లిం మైనార్టీల కోసం అంబర్‌పేట కొత్త ఏర్పాటు చేసిన శ్మశానవాటికను సత్వరమే అందుబాటులోకి తెచ్చేలా చొరవ తీసుకుంటానని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ తెలిపారు. శుక్రవారం జీహెచ్ఎంసీ అధికారులు, కార్పొరేటర్, కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన శ్మశానవాటికను సందర్శించారు. శ్మశానవాటికలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేయాలని ఆయన అధికారులకు సూచించారు. నిధుల కొరత ఉంటే తన సొంత నిధుల నుంచి మంజూరు చేయించేందుకు కృషి చేస్తానన్నారు. అంబర్‌పేట నియోజకవర్గంలో ముస్లింలు ఎన్నో ఏళ్ల నుంచి శ్మశానవాటిక సమస్యను ఎదుర్కొంటున్నారని అన్నారు. వారి సమస్య పరిష్కారమే ధ్యేయంగా చర్యలు తీసుకుంటానన్నారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి సహకరిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంసీ మారుతీదివాకర్, కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ పులి జగన్, కాంగ్రెస్ పార్టీ అంబర్‌పేట డివిజన్ అధ్యక్షుడు ఏర్పుల రవికుమార్, శ్మశానవాటిక కమిటీ నాయకులు ఉన్నారు.

పారదర్శకంగా ఓటరు జాబితాను రూపొందిస్తాం



రాజకీయ పార్టీల నేతలతో మాట్లాడుతున్న డీఎంసీ మారుతీదివాకర్

అంబర్‌పేట: ఓటరు జాబితాను పారదర్శకంగా రూపొందించేందుకు అన్ని రాజకీయ పార్టీల నేతలు సహకరించాలని సర్కిల్-16 డీఎంసీ మారుతీదివాకర్ కోరారు. అంబర్‌పేట నియోజకవర్గ ఓటరు జాబితా సవరణ, కొత్త ఓటర్ల నమోదు వంటి ప్రక్రియపై శుక్రవారం సర్కిల్ కార్యాలయంలో ఆయన వివిధ రాజకీయ పార్టీల నేతలతో సమావేశాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ బూత్‌లకు కొత్త సిబ్బందిని కేటాయించామని పేర్కొన్నారు. వారితో సమన్వయం చేసుకుని ఓటర్ జాబితాలో సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలన్నారు. ఒక ఇంటి ఓటర్లు ఒకే పోలింగ్ బూత్‌లో ఉండేలా, చిరునామా మార్పు, మృతి చెందిన ఓటరు వివరాలు వంటివి క్షేత్ర స్థాయిలో పరిశీలన జరుగుతోందని తెలిపారు. ఎలాంటి సవరణలు ఉన్న తమ సిబ్బంది దృష్టికి తీసుకువస్తే తక్షణమే పరిష్కారానికి చొరవ తీసుకుంటారని అన్నారు. ప్రతి పోలింగ్‌బూత్ ఓటరు జాబితాను పరిశీలించి అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని రాజకీయ పార్టీలను కోరారు. ఈ సమావేశంలో అధికారులతో ఆయా పార్టీ నాయకులు శంభుల శ్రీకాంత్‌గౌడ్ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.


రైతాంగ వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి



అఖిల భారత విప్లవ రైతు సంఘం సమావేశంలో మాట్లాడుతున్న జక్కుల నరసింహ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని అఖిల భారత విప్లవ రైతు సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు జక్కుల నరసింహ పిలుపునిచ్చారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అఖిల భారత విప్లవ రైతు సంఘం ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జక్కుల నరసింహ మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రైతు వ్యతిరేక చట్టాలతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని అన్నారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో అనేక మంది రైతులు తమ ప్రాణాలను కూడా కోల్పోయారని అన్నారు. రైతు రుణాల మాఫీ, పంటకు మద్దతు ధర, 1973 భూ సంస్కరణల చట్టాలను సవరణ చేయాలన్నారు. అదే విధంగా భూమిలేని ప్రజలకు భూమిని పంచాలని కోరారు. పోడు భూములు సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలు ఇవ్వాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసి సాగు, తాగునీరు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు శంకర్, ఆర్.మానసయ్య, సారయాదవ్, గుర్రం వెంకట్‌రెడ్డి, గోగర్ల శంకర్, వేముల రాజయ్య, పెండూరు ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

సాహితీ విశ్వంభరుడు సినారె



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి

చిక్కడపల్లి: విశ్వంభర కావ్యంతో జ్ఞానపీఠం స్థాయికి ఎదిగిన సినారె జాతీయ సాహిత్యంలో విశ్వంభరుడని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. త్యాగరాయ గానసభలో ఎందరో మహానుభావులు కార్యక్రమంలో భాగంగా డాక్టర్ సినారె యాదిలో.. ఆయన జయంతిని శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా మధుసూదనాచారి మాట్లాడుతూ... తెలంగాణ మారుమూల పల్లె నుంచి తన అక్షర శక్తితో కేంద్రం నుంచి పద్మవిభూషణ్ అందుకునే స్థాయికి ఎదిగారని అన్నారు. గత రాష్ట్ర ప్రభుత్వం పలు పదవులకు సినారెను ఎంపిక చేసిందని గుర్తు చేశారు. నాటి మహా నటుడు ఎన్టీఆర్‌కు అత్యంత ఆత్మీయుడు అయిన సినారె తొలిసారిగా ఆయనకు పాటరాసి సినీరంగ ప్రవేశం చేశారని తెలిపారు. తెలుగు భాషాభివృద్ధికి విశేష కృషి జరిపారన్నారు. సాహితీ ప్రక్రియల్లో పలు ప్రయోగాలకు నాంది పలికారని కొనియాడారు. మారుమూల పల్లె నుంచి తన అక్షర శక్తితో ఎంతో ఎత్తుకు ఎదిగారన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనామూర్తి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ప్రముఖులు బి.జయరాములు, బి.నరేందర్‌గౌడ్, బాలాజికుమార్, రవిచందర్ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణపై ప్రత్యేక దృష్టిసారించాలి



దోమల నివారణపై అవగాహన కార్యక్రమంలో డీఎంసీ మారుతీదివాకర్, కార్పొరేటర్ విజయ్

అంబర్‌పేట: దోమల నివారణ పట్ల విద్యార్థులు పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని జీహెచ్ఎంసీ సర్కిల్-16 డీఎంసీ మారుతీదివాకర్ తెలిపారు. శుక్రవారం అంబర్‌పేట సీపీఎల్ రోడ్ లకోటియా ప్రభుత్వ పాఠశాలలో దోమల నివారణపై స్థానిక కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి విద్యార్థులకు ఆయన అవగాహన కల్పించారు. వర్షకాలంలో దోమల వ్యాప్తి ఎక్కువగా ఉంటుందన్నారు. దీంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. డెంగీ, మలేరియా వంటి వ్యాధులను అరికట్టేందుకు దోమల నివారణ ఉత్తమమని అన్నారు. పరిసరాల్లో దోమల నివారణపై చేపట్టాల్సిన జాగ్రత్తలను ఆయన విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు ప్రత్యేక దృష్టి సారిస్తే ఇంటి వద్ద, బడి వద్ద దోమల వ్యాప్తి లేకుండా చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ సిబ్బందితో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.